క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: జీపీఓలకు కౌన్సెలింగ్ పద్ధతిలో ఆర్డర్లు ఇవ్వాలని తెలంగాణ గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వికలాంగులైన వారికి, భార్య, భర్తలిద్దరు ఉద్యోగులైన వారికి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, మహిళలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బంకా కృష్ణయ్య, ధరావత్ భాస్కర్, రాజారత్నం, పద్దం వెంగళరావు, బంకా భాస్కర్, వెంకన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా

ఖమ్మం సహకారనగర్: నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో విద్యార్థులకు ఐటీ హబ్‌కు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టెక్ సైకి ఆధ్వర్యాన సోమవారం జాబ్‌మేళా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ చేకూరి రవికుమార్, కంపెనీ మేనేజర్ సైదేశ్వర్ తెలిపారు. పీజీ, బీపీఈడీ కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరు కాగా.. వీరికి స్థానిక ఐటీ హబ్‌లో ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేల్స్‌మెన్ సమీర్, హెచ్‌ఆర్‌లు రవితేజ, దుర్గాప్రసాద్, పృథ్వి, అనుదీప్, సురేష్, హసీనా, హరికృష్ణ, అధ్యాపకులు లక్ష్మి హరిత, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

ఖమ్మంఅర్బన్: నగరంలోని కై కొండాయిగూడెం క్రాస్‌రోడ్డు జంక్షన్‌లో ఉన్న శ్రీ విశాలాక్షి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అధ్యక్షుడు, కార్పొరేటర్ నాగండ్లకోటి మాట్లాడుతూ.. ఆలయ పరిధిలో భక్తులు, దాతల సహకారంతో ప్రతి నెలా సోమవారం నిత్యాన్నదానానికి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వీధి కుక్కల పట్టివేత

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టెంపుల్ సిటీ పరిసరాల్లో సంచరిస్తున్న 14 వీధి కుక్కలను సోమవారం మున్సిపాలిటీ సిబ్బంది పట్టుకుని ఖమ్మం కార్పొరేషన్‌లోని ఏనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలించారు. ఆపరేషన్ చేసి వదిలి వేయనున్నట్లు కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ ఆపరేషన్ నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరు

నేలకొండపల్లి: నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని ఆమ్ ఆద్మీ పార్టీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన కోసం చేపట్టిన చలో రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు సోమవారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదన్నారు. ముందస్తు అరెస్ట్ చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేదంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కూలీ
వినోద	వార్-2, మహావతార్ నర్సింహా
సాయిరాం	కూలీ
ఆదిత్య	సు ఫ్రం సో
శ్రీనివాస	వార్-2, అతడు

\- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	50	బచ్చలికూర	4
వంకాయ	30		20
బెండకాయ	16	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	26	చుక్కకూర	3
బోడ కాకర	140		20
బీర	46	తోటకూర	4
దొండ	20		20
పొట్లకాయ	26	గోంగూర	4
చిక్కుడు	40		20
గోరుచిక్కుడు	38	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	28		25
చామగడ్డ	30	పుదీన	1
క్యారెట్	52		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

డ్రైడే లోపాలు.. ప్రజలకు శాపాలు



11వ డివిజన్‌లోని ఓ నివాసంలో నీటిలో లార్వాను గుర్తించి పడబోస్తున్న హెల్త్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

- ప్రజల్లో లోపిస్తున్న అవగాహన
- నామమాత్రంగానే ప్రచారం
- పెరుగుతున్న దోమల వ్యాప్తి
- నేటికి 16కు పైగా డెంగీ కేసులు నమోదు

ఖమ్మంమయూరిసెంటర్: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వాలు ప్రతి పల్లె, పట్టణంలో డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ వస్తున్నాయి. గత కొన్నేళ్లుగా దోమల వ్యాప్తిని అడ్డుకునేందుకు డ్రైడేను నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ఈ ఏడాది ప్రతి మంగళ, శుక్రవారం నిర్వహించే డ్రైడేలో అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని, నామమాత్రంగానే ఒకటి రెండు ఇళ్లకు వెళ్లి ఫొటోలు దిగి తూతూమంత్రంగా నిల్వ నీటిని పడబోయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక ప్రజలు కూడా నీళ్లను రోజుల తరబడి డబ్బాలు, గాబులు, ట్రేలలో నిల్వ ఉంచడంతో లార్వా వృద్ధి చెందుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

నిల్వ నీటితో వృద్ధి..

డెంగీ వ్యాధి వ్యాప్తి ఈడిస్ ఈజిప్టి అనే దోమలు ప్రధానంగా శుభ్రమైన నీటిలోనే గుడ్లు పెడతాయి. కూలర్లు, పూలకుండీలు, పాత టైర్లు, ట్యాంకులు, కొబ్బరి చిప్పలు, డబ్బాలు, గాబులు వంటి వాటిలో నీరు నిల్వ ఉండడం వల్ల దోమల లార్వా విపరీతంగా వృద్ధి చెంది డెంగీ వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఇక డెంగీ జ్వరం ఉన్న వ్యక్తిని కుట్టిన దోమ మరో వ్యక్తిని కుట్టినా ఆ వ్యక్తికి డెంగీ వ్యాపిస్తుంది. దీంతో దోమలు పుట్టకుండా అరికట్టాల్సిన బాధ్యత అటు ప్రజల్లో కూడా ఉంది.

ఇంటింటా పరిశీలన..

గత కొన్ని రోజులుగా మలేరియా విభాగానికి చెందిన హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యాన హెల్త్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌వర్కర్లు డెంగీ పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని ఇళ్లల్లో నిల్వ నీటిని పరిశీలిస్తున్నారు. ప్రతి పది ఇళ్లల్లో నాలుగైదు ఇళ్లల్లోని నిల్వ నీటిలో లార్వాను గుర్తిస్తున్నారు. నగరంలో లార్వా విస్తృతంగా ఉన్నట్లు వీరి పరిశీలనలో గుర్తించారు. నగరంలో డ్రైడేను పాటించకపోవడంతోనే లార్వా వృద్ధి చెంది దోమల వ్యాప్తికి కారణమవుతున్నట్లు మలేరియా విభాగం అధికారులు చెబుతున్నారు. ఆ విభాగంలో ప్రస్తుతం నాలుగు బృందాలు మాత్రమే పని చేస్తుండడంతో నగరమంతటా లార్వాను గుర్తించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే డ్రైడేలో వీరితో పాటు ఆర్పీలు, అంగన్‌వాడీలు, కార్పొరేషన్ జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొని నిల్వ నీటిని పరిశీలిస్తే ల్వారా వృద్ధి చెందకుండా అడ్డుకోవచ్చనే చర్చ కార్పొరేషన్‌లో జరుగుతోంది. ఇకనైనా డ్రైడేను పకడ్బందీగా నిర్వర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే డెంగీతో పాటు ఇతర సీజనల్ వ్యాధులు మరింతగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది.

ఒక్క నెలలో 16 పాజిటివ్ కేసులు..

వర్షాకాలం సీజన్ ప్రారంభమైన తర్వాత ఈ ఏడాది నమోదైన డెంగీ కేసులన్నీ ఆగస్టులో వచ్చినవే. ఈ నెలలో ఇప్పటి వరకు 16 డెంగీ కేసులు నమోదైనట్లు అధికారిక లెక్కలు చెబుతుండగా.. వాటిలో ఈ నెల 7వ తేదీన 6 కేసులు నమోదయ్యాయి. 2024 ఏడాదిలో మొత్తం 14 కేసులు మాత్రమే నమోదు కాగా.. ఈ ఏడాది ఆగస్టులోనే ఆ సంఖ్యను దాటిపోయింది. దీంతో నగరంలో డెంగీ దోమల వ్యాప్తి తీవ్రత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు అప్రమత్తమైతేనే డెంగీని అడ్డుకోవచ్చనే చర్చ కేఎంసీలో జరుగుతోంది.

కేఎంసీ సమాచారం..



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్

● గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరణ..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలకసంస్థ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం ప్రజల నుంచి 24 ఫిర్యాదులు స్వీకరించారు. రమణగుట్ట ప్రాంతంలో డ్రెయినేజీలపై నిర్మించిన ర్యాంపులతో వర్షపునీరు బయటకుపోయే పరిస్థితి లేదని, ర్యాంపులను తొలగించాలని స్థానికులు ఫిర్యాదు చేయగా.. సమస్యను పరిష్కరించాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. తన భర్త చనిపోయి ఏడాది అవుతున్నా వృద్ధాప్య పింఛన్ తన పేరుపై మారలేదని ద్వారకానగర్‌కు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేయగా.. మేయర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇక బల్లేపల్లి, పాత కేఎంసీ కార్యాలయాల్లోని జోనల్ కార్యాలయాల్లో అధికారులు గ్రీవెన్స్‌ను నిర్వహించారు.

● సద్వినియోగం చేసుకోండి..

నగర ప్రజలు తమ సమస్యలను తెలిపేందుకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కేఎంసీ కమిషనర్ అగస్త్య తెలిపారు. సోమవారం ఫిర్యాదుల బాక్స్‌ను ఓపెన్ చేయించి వాటిలోని ఫిర్యాదులను పరిశీలించారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

● పార్కులను పరిశీలించిన ఉద్యాన అధికారిణి..

నగరంలోని పలు పార్కులను ఉద్యాన అధికారిణి బెల్లం రాధిక సందర్శించారు. పార్కులో పెరుగుతున్న మొక్కలు, పార్కుల శుభ్రత, ఆవరణలోని పూల మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ప్రతి పార్కును నిత్యం శుభ్రంగా ఉంచాలని, ప్రజలు సేద తీరేలా నిర్వహణ ఉండాలని సిబ్బందిని ఉద్యాన అధికారిణి ఆదేశించారు.

● రెయిన్ కోట్లు పంపిణీ..

కేఎంసీలో పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికులకు మేయర్ పునుకొల్లు నీరజ రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. కేఎంసీ ఆధ్వర్యాన పారిశుద్ధ్య విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు, డ్రైవర్లకు అందజేస్తున్నట్లు తెలిపారు.

● ప్రశంసాపత్రాల కోసం పైరవీలు..?

ఆగస్టు 15న ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులు, సిబ్బందికి అందించే ప్రశంసాపత్రాల కోసం కొంతమంది సిబ్బంది ప్రజాప్రతినిధులతో అధికారులకు పైరవీలు చేయించుకున్నారన్న చర్చ కేఎంసీలో కొనసాగుతోంది. కమిషనర్‌కు తెలియకుండా ఆ కింది స్థాయి అధికారికి ఓ ప్రజాప్రతినిధి ఫోన్ చేసి తాను సూచించిన వారికి అందించాలని చెప్పినట్లు కేఎంసీలో చర్చ జరుగుతోంది. సిబ్బంది పని తీరు నచ్చక ఇటీవల కమిషనర్ విభాగాలు మార్చిన వారికి ప్రశంసాపత్రాలు ఇవ్వడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

● పాత విభాగాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు..

అనేక ఆరోపణలు రావడంతో పలువురు కంప్యూటర్ ఆపరేటర్లను కమిషనర్ అభిషేక్ అగస్త్య వారు పని చేస్తున్న విభాగం నుంచి ఇతర విభాగాలకు మార్చారు. తిరిగి పాత విభాగాలకు వెళ్లేందుకు సదరు కంప్యూటర్ ఆపరేటర్లు పైరవీలకు తెరలేపినట్లు తెలుస్తోంది. కొందరు సిబ్బంది ఒక గ్రూపుగా ఏర్పడి తమ పనులను చక్కబెట్టుకునేందుకు ఓ ప్రజాప్రతినిధితో మంతనాలు జరుపుతున్నట్లు కేఎంసీలో చర్చ నడుస్తోంది.

తహసీల్.. ఇక అద్దె భవనంలోకి..

సాక్షి ఎఫెక్ట్..



బీసీ కాలనీలోని తహసీల్దార్ కార్యాలయం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థలకు చేరుకోగా.. అధికారులు భయం భయంగా కార్యకలాపాలు సాగిస్తున్న పరిస్థితులపై 'సాక్షి 'దినపత్రిలో ఈ నెల 5న 'శిథిలం.. వానొస్తే భయం!'అనే కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్ సమీపంలోని బీసీ కాలనీలోని రెండంతస్తుల అద్దె భవనంలోకి సోమవారం కార్యాలయాన్ని మార్చారు. సాక్షిలో కథనం ప్రచురితమైన రోజు తిరుమలాయపాలెంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్న కార్యాక్రమానికి హాజరైన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసీల్‌ను అద్దెభవనంలోకి మార్చాలని తహసీల్దార్ విల్సన్‌ను ఆదేశించడంతో కార్యాలయాన్ని మార్చి సోమవారం నుంచి పనులను ప్రారంభించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మవైరారోడ్: వర్షాల నేపథ్యాన సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సూచించారు. మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. నిల్వ నీటిని తొలగించడం, శానిటేషన్ చర్యలు చేపట్టడం, డ్రెయినేజీలను శుభ్రపర్చడం వంటి కార్యక్రమాలను నిరంతరాయంగా చేపట్టాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, వైద్య సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాక ఇటీవల కల్లూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనపై నామ స్పందించారు. పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీరు, భోజనం విషయంలో నిర్లక్ష్యం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓను సన్మానిస్తున్న కృష్ణారావు, తదితరులు

నేలకొండపల్లి: జిల్లా ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న స్థానిక ఎంపీడీఓ ఎం.యర్రయ్యను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మోటాపురం సొసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో ఆదర్శంగా పాలన సాగించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బెల్లం శ్రీనివాసరావు, రావెళ్ల కృష్ణారావు, చావా కృష్ణమూర్తి, బాగం ప్రభాకర్‌రావు, బాగం హనుమంతరావు, గుగులోత్ చంటి, భూక్యా లక్ష్మణ్, టీడీపీ నాయకులు బాగం మురళీ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రీవెన్స్‌లో ఎంపీడీఓను సన్మానించగా.. తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు పాల్గొన్నారు.

ఏదులాపురం మున్సిపాలిటీ సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు అన్నారు. పెదతండాలోని టీచర్స్ కాలనీలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం బృందం పర్యటించి పలు సమస్యలను గుర్తించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశుద్ధ సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులను కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట బి.గణపతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు నేస్తం కార్యక్రమం

రఘునాథపాలెం: రైతుల ప్రయోజనార్థం మంగళవారం ఉదయం 10 గంటలకు రఘునాథపాలెం, వీవీ పాలెం, రాంక్యాతండా రైతు వేదికలలో రైతు నేస్తం అవగాహన కార్యక్రమం నిర్వహించబడనుందని ఏఓ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మామిడితోటల పునరుద్ధరణపై అవగాహన కల్పించనున్నట్లు తలిపారు.

సమస్యలపై వినతులు

● **కామేపల్లి:** ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి బాదావత్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కామేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శిరీషకు వినతిపత్రం అందించారు. అర్హులైన వారిని ఏఎన్‌ఎంలుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

● **కూసుమంచి:** మండలంలోని మల్లేపల్లిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యాన సోమవారం ఎంపీడీఓ రాంచందర్‌రావుకు వినతిపత్రం అందించారు. పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, నాయకులు చీర్ల రాధాకృష్ణ, తాళ్లూరి రవి, ఎం.చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నవోదయలో క్లస్టర్ లెవల్ కళా ఉత్సవ్



పాటలు పాడుతున్న విద్యార్థులు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న క్లస్టర్ లెవల్ కళా ఉత్సవ్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంఈఓ బీవీ రామాచారి ప్రారంభించగా.. వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు చదవుతో పాటు సృజనాత్మకత ముఖ్యమని, కళా రంగంలో రాణించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులకు కళా ఉత్సవ్ పేరుతో సంగీతం, గానం, చిత్రలేఖనం, శిల్పకళ, వాయిద్యం తదితర పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని రీజినల్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలు నవోదయ విద్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సొసైటీ, ఎరువుల దుకాణాలను ఏఓ ఎం.రాధ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు అవసరాల మేరకు యూరియాను తీసుకోవాలని సూచించారు. స్టాక్ వివరాలు ప్రతీ రోజు అప్డేట్ చేయాలని ఆదేశించారు. సొసైటీ, ఎరువుల దుకాణాల్లో పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు అవినాష్, అరవింద్, భవానీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట ధర్నా

నేలకొండపల్లి: యూరియా రైతులకు సరిపడా అందించాలని సీపీఎం పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం యూరియా కోసం రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి, భూక్యా కృష్ణ, ఇంటూరి అశోక్, దుగ్గి నరసింహారావు, కే.వీ.చారీ, సామాల మల్లిఖార్జున్‌రావు, మల్లేశ్వరరావు, పెరుమాళ్లు, కొండలరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



నగదు అందిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

నేలకొండపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో మండల ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు తల్లి బాలిన శాంతమ్మ జ్ఞాపకార్థం ప్రతి ఏటా ప్రోత్సాహకాలు అందిస్తుండగా.. ఈ ఏడాది గురుకుల పాఠశాల విద్యార్థిని గ్రేషితకు రూ.10,116 నగదు అందించారు. ఎంపీడీఓ ఎం.యర్రయ్య, తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి ఎం.రాధ, సీఆర్‌పీలు ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్ దాతను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంఅర్బన్: నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద గల టేకులపల్లి శ్రీ భక్త ఆంజనేయ స్వామి ప్రాంగణంలో ఉన్న శ్రీకృష్ణ మందిరానికి రూ. 25 వేల విలువైన మైక్‌సెట్, ఆంప్లిఫయర్‌ను సోమవారం విరాళంగా అందజేశారు. ఖమ్మం జిల్లా జాతీయ కన్స్యూమర్ రైట్స్ వైస్‌చైర్మన్ పొదిల రాజలింగేశ్వరరావు–కల్పన దంపతులు వారి తల్లిదండ్రులు పొదిల (బంజర) భిక్షమయ్య, సుభద్ర దంపతుల జ్ఞాపకార్థం విరాళాన్ని సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాకదాని శ్రీహరి, పొదిల చిన్న పాపారావు, కుర్రి వెంకటస్వామి, పొదిల కన్నయ్య, తంగేళ్ల ఉపేందర్, చిలకల శివ, ఏరదేశి శ్రీను, గోరింకల కృష్ణ, వాకదాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పూల వ్యాపారుల సిండికేట్ దందా

ఖమ్మంగాంధీచౌక్: పూల వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి ప్రజల, భక్తుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయించి దందాకు పాల్పడుతున్నారని స్తంభాద్రి ఉత్సవ కమిటీ ఆరోపించింది. ఈ మేరకు స్తంభాద్రి ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కీసర జయపాల్‌రెడ్డి, కార్యాధ్యక్షుడు గెంటేల విద్యాసాగర్, కార్యదర్శి అల్లిక అంజయ్యలు సోమవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ఖమ్మంకు చెందిన కొద్ది మంది పూల వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి వ్యాపారులను బెదిరిస్తూ రూ.10 వేల నుంచి రూ. 50వేల వరకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. రైతులు, వ్యాపారులు పూలను స్వేచ్ఛగా అమ్ముకునేలా, సిండికేటు వ్యాపారుల నుంచి ఇబ్బందులులేకుండా విక్రయించుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ శాఖలను కోరారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

ఖమ్మంరూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండలంలోని పల్లెగూడెంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో సీపీఐకి బలమైన వార్డులున్నాయని, మున్ముందు పార్టీ బలోపేతానికి యువతరం నడుం బిగించాలని, పార్టీ అభివృద్ధికి యువతే కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ అధ్యక్షుడు ఎండీ.మౌలానా, నాయకులు పుచ్చకాయల సుధాకర్, మిడకంటి చినవెంకటరెడ్డి, లింగా వెంకటనారాయణ, ఎడ్లపల్లి శంకరయ్య, పగిళ్ల వీరభద్రం, వెంపటి సురేందర్, సీతామహాలక్ష్మి, కిషన్‌రావు, బి.రామ్మూర్తి, కె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ విగ్రహానికిబీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, రామకృష్ణ, కొండా హర్షవర్ధన్, దేశబోయిన వేణుబాబు, మూడు రమేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పరిశీలించిన ఎస్ఈ



అవుట్‌ఫ్లో కాల్వను పరిశీలిస్తున్న ఎస్ఈ

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్‌ను సోమవారం జలవనరుల శాఖ ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు పరిశీలించారు. రిజర్వాయర్‌కు వస్తున్న ఇన్‌ఫ్లోతో పాటు అవుట్ ఫ్లోను పరిశీలించి వరద ప్రవాహంతో అలుగు పారుతుండగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎస్ఈ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పాలేరు గ్రామానికి చెందిన దారోజు రమేష్ అనారోగ్యంతో మృతిచెందగా.. నివాళులర్పించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం సర్వాయి పాపన్న కనబర్చిన పోరాటం , తెగువ ఎంతో స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం మామిళ్లగూడెం: నివాళులర్పిస్తున్న ఖమ్మం జిల్లా గోపా బాధ్యులు



తిరుమలాయపాలెం: సుబ్లేడులో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు